తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 159 24-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో

ఆయిల్ రవాణా: ట్రంప్

హర్మూజ్ జలసంధిలో ఒక్కరోజే 19 మిలియన్ బ్యారెళ్ల ఆయిల్ రవాణా

ఇరాన్‌తో ఒప్పందం వల్లే ఇది సాధ్యమైందని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

ఈ పరిణామంతో ప్రపంచవ్యాప్తంగా తగ్గుముఖం పడుతున్న చమురు ధరలు

అమెరికా, ఇరాన్‌ల మధ్య ఇటీవల కుదిరిన ఒప్పందం ఆశించిన సత్ఫలితాలనిస్తోందని, హర్మూజ్ జలసంధి ద్వారా చమురు రవాణా తిరిగి భారీగా పుంజుకుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. సోమవారం ఒక్కరోజే ఈ జలసంధి గుండా 1.9 కోట్ల బ్యారెళ్ల చమురు రవాణా జరిగిందని, ఇది ఒక సంచలనాత్మక రికార్డు అని ఆయన ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "నిన్న హర్మూజ్ జలసంధి నుంచి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అయింది. ఇది ఒక సరికొత్త రికార్డు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు మరింత సురక్షితమైన ప్రదేశంగా మారింది" అని ఆయన పేర్కొన్నారు. ఈ సానుకూల పరిణామంతో అంతర్జాతీయ విపణిలో ముడి చమురు ధరలు తగ్గాయి. నిరసనలు, తప్పుడు ప్రచారాల ద్వారా అమెరికా విజయాన్ని తక్కువ చేసే ప్రయత్నాలు జరిగినప్పటికీ,

(మిగతా 2వ పేజీలో)

ప్రజాకేంద్రీకృత పరిపాలనే

అభివృద్ధికి పునాది

యువ ఐఏఎస్‌లకు బాధ్యతాయుత పరిపాలనపై ప్రధాని సందేశం

ప్రతి నిర్ణయంలో ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచన

వికసిత భారత్ లక్ష్య సాధనలో అధికారుల పాత్ర కీలకమన్న మోదీ

డేటా వెనుక ప్రజల జీవితాలను చూడాలని పిలుపు

బ్రిక్స్ దేశాల మధ్య భద్రతా సహకారం పెరగాలన్న అభిప్రాయం

ఉగ్రవాదం, సైబర్ సవాళ్లను సమష్టిగా ఎదుర్కోవాలని సూచన

న్యూఢిల్లీ: ప్రజల ఆకాంక్షలు, అవసరాలు, సమస్యలే పరిపాలనకు కేంద్ర బిందువుగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువ ఐఏఎస్ అధికారులకు సూచించారు. పరిపాలనా వ్యవస్థలో చేరుతున్న ప్రతి అధికారి ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. వివిధ కేంద్ర

(మిగతా 2వ పేజీలో)

విరిసిన పద్మాలు

రెండో విడత పద్మ పురస్కారాలను అందజేసిన రాష్ట్రపతి

వైద్యం, కళలు, క్రీడలు సహా పలు రంగాల ప్రముఖులకు సత్కారం

తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురికి జాతీయ స్థాయి గుర్తింపు

క్యాన్సర్ వైద్య నిపుణుడు నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్

సినీ, శాస్త్ర, పశుసంవర్ధక రంగాల సేవలకు పద్మశ్రీ పురస్కారాలు

క్రికెట్ కెప్టెన్ రోహిత్ శర్మకు పద్మశ్రీ

న్యూఢిల్లీ: దేశ అభివృద్ధికి, సమాజ పురోగతికి వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు రెండో విడత పద్మ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా ప్రదానం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన దాదాపు 65 మంది ప్రముఖులు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారు. కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ విడతలో రెండు పద్మ విభూషణ్, ఏడు పద్మభూషణ్, 56 పద్మశ్రీ పురస్కారాలను రాష్ట్రపతి ప్రదానం చేశారు. దేశ సేవ, ప్రజా సంక్షేమం, విజ్ఞానం, వైద్యం, కళలు, సాహిత్యం, క్రీడలు తదితర రంగాల్లో అసాధారణ కృషి చేసిన వ్యక్తులను ఈ అవార్డులతో సత్కరించారు. పురస్కార గ్రహీతలను రాష్ట్రపతి ఒక్కొక్కరిని అభినందిస్తూ సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైద్య రంగంలో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పద్మభూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. క్యాన్సర్ చికిత్స, పరిశోధన, వైద్య సేవల ద్వారా వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన ఆయన కృషికి కేంద్ర ప్రభుత్వం ఈ అత్యున్నత గౌరవాన్ని అందించింది. వైద్య రంగంలో భారత ప్రతిష్ఠను ప్రపంచస్థాయిలో నిలబెట్టిన వ్యక్తిగా ఆయనకు విశేష గుర్తింపు లభించింది. తెలుగు చలనచిత్ర పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులకు కూడా ఈ వేడుకలో విశిష్ట గౌరవం దక్కింది. నటుడిగా, నిర్మాతగా సుదీర్ఘకాలం సినీ పరిశ్రమకు సేవలందించిన మాజీ ఎంపీ మురళీమోహన్‌కు పద్మశ్రీ పురస్కారం లభించింది. తన సహజ నటనతో అనేక తరాల ప్రేక్షకులను అలరించిన ప్రముఖ నటుడు రాజేంద్రప్రసాద్ కూడా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. తెలుగు సినీ రంగానికి చేసిన సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ గౌరవాన్ని ప్రకటించింది. తెలంగాణకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ కుమారస్వామి తంగరాజ్‌లకు కూడా పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో వారి విశిష్ట కృషికి జాతీయ స్థాయిలో

(మిగతా 2వ పేజీలో)

తెలుగు రాష్ట్రాల్లో

ఈ నెలాఖరు వరకు విస్తారంగా భారీ వర్షాలు

30వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షాలు

తెలంగాణలో 5 డిగ్రీల వరకు తగ్గనున్న ఉష్ణోగ్రతలు

నేడు కోస్తాంధ్రలో, 28-30 మధ్య దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు

తెలంగాణలోని 8 జిల్లాలకు ఎల్లో అలెర్ట్

మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు: కేటీఆర్

రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్ఆర్ ట్యాక్స్ నడుస్తోందని ఆరోపణ

రియల్ ఎస్టేట్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శ

మెట్రో వ్యవహారంలో రేవంత్, కిషన్‌రెడ్డివి నాటకాలని వ్యాఖ్య

మహిళలకు హామీ ఇచ్చిన సొమ్ము వెంటనే చెల్లించాలని డిమాండ్

జీహెచ్ఎంసీ ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపు

కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు!

కేంద్ర సర్వీసుల నుంచి తిరిగి రాష్ట్రానికి సీనియర్ అధికారి

తెలంగాణ కేడర్‌కు పంపేందుకు కేంద్రం ఆమోదం

తదుపరి సీఎస్‌గా నియామకం ఖాయమనే సంకేతాలు

నెలాఖరుతో ముగియనున్న రామకృష్ణారావు పదవీకాలం

జయేశ్ రంజన్, వికాస్‌రాజ్ పేర్లు కూడా పరిశీలనలో

12 ఏళ్ల తర్వాత సొంత కేడర్‌కు తిరిగి రాక

పాలనా వ్యవస్థలో కీలక మార్పులకు అవకాశం

హైదరాబాద్: తెలంగాణ తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో కొనసాగుతున్న ఆయనను తెలంగాణ కేడర్‌కు తిరిగి పంపాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ

(మిగతా 2వ పేజీలో)

హైదరాబాద్ మెట్రోకు కొత్త దారి.. కేంద్ర-రాష్ట్రాల ఉమ్మడి అడుగులు

మెట్రో నిర్వహణకు జైపూర్ నమూనా ప్రతిపాదన

కేంద్ర సూచనకు సూత్రప్రాయ అంగీకారం తెలిపిన రాష్ట్రం

ఫేజ్-1, ఫేజ్-2పై సమగ్ర అధ్యయనానికి నిర్ణయం

కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐ క్యాప్స్ ఎంపిక

సమన్వయం కోసం సంయుక్త కమిటీ ఏర్పాటు

రుణ వ్యవహారాలపై కొత్త మార్గదర్శకాలు

మెట్రో భవిష్యత్తుకు కీలక మలుపుగా చర్చలు

న్యూఢిల్లీ: హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు భవిష్యత్తు అభివృద్ధి, నిర్వహణ అంశాల్లో కేంద్రం-రాష్ట్రం కలిసి ముందుకు సాగాలని కీలక నిర్ణయం తీసుకున్నాయి. మెట్రో వ్యవస్థ నిర్వహణ, విస్తరణ కోసం రాజస్థాన్‌లో అమలవుతున్న 'జైపూర్ మోడల్'ను కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. ఈ ప్రతిపాదనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సమాచారం. దీంతో హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు నిర్వహణలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిశారు. ఈ సమావేశంలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. హైదరాబాద్ మెట్రో భవిష్యత్తు, విస్తరణ ప్రణాళికలు, ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ విధానాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి.



మెట్రో ఫేజ్--1 వాల్యూయేషన్, ప్రస్తుత ఆస్తుల అంచనా, రుణ సేకరణ, రుణదాత సంస్థల ఎంపిక, ఫేజ్--2 విస్తరణ వ్యయం, నిర్మాణ ప్రణాళికలు వంటి అంశాలపై సమగ్ర అధ్యయనం చేపట్టాలని సమావేశంలో ఏకాభిప్రాయం కుదిరింది. ఈ అధ్యయనం కోసం ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ లిమిటెడ్ (ఎస్‌బీఐ క్యాప్స్)ను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. సంస్థ సమర్పించే నివేదిక ఆధారంగా మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి తదుపరి నిర్ణయాలు తీసుకోనున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేంద్రం తరఫున ఒక సీనియర్ అధికారిని, రాష్ట్రం తరఫున పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శిని ఈ కమిటీలో సభ్యులుగా నియమించనున్నారు. అధ్యయన ప్రక్రియలో

ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

రైతుల ప్రయోజనాల కోసం ఢిల్లీలో

కేంద్ర మంత్రితో మంత్రులు ఉత్తమ్, తుమ్మల భేటీ

సీఎంఆర్ సరఫరా గడువుల పొడిగింపుపై ప్రత్యేక విజ్ఞప్తి

వరి సేకరణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది: ఉత్తమ్

న్యూఢిల్లీ: తెలంగాణలో వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణ రికార్డు స్థాయికి చేరుకున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన కొనుగోలు లక్ష్యాలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. అలాగే కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గడువును పొడిగించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి

(మిగతా 2వ పేజీలో)

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

హైదరాబాద్ మెట్రోకు కొత్త దారి.. కేంద్ర-రాష్ట్రాల ఉమ్మడి అడుగులు

పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కేంద్రంతో సమన్వయంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇక మెట్రో ఫేజ్-1కు సంబంధించి రుణ వ్యవహారాలపై కూడా కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. ప్రాజెక్టులో ఈక్విటీ షేర్ కొనుగోలుకు రూ.1,461.47 కోట్లు, అప్పుల రీఫైనాన్సింగ్‌కు రూ.13,538.53 కోట్లు కలిపి మొత్తం రూ.15 వేల కోట్ల నిధుల సమీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్‌ఎఫ్‌సీ)తో చర్చలు జరిపింది. అయితే నిర్ణయించిన గడువులోగా మొదటి విడత రుణం విడుదల కాకపోవడంతో అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన సమావేశంలో ముందుగా మెట్రో ఫేజ్-1 వాస్తవ విలువను అంచనా వేయాలని నిర్ణయించారు. ఎస్‌బీఐ క్యాప్స్ నివేదిక ఆధారంగా రుణదాత సంస్థను ఎంపిక చేయనున్నారు. భవిష్యత్తులో ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రుణం తీసుకోవాలా లేదా ఇతర ఆర్థిక సంస్థలను ఎంపిక చేయాలా అన్న అంశంపై కేంద్రం, రాష్ట్రం సంయుక్తంగా నిర్ణయం తీసుకోనున్నాయి. దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ--ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) నమూనాలో నిర్మితమైన హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టు 2017లో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. ఎల్అండ్‌టీ సంస్థ నిర్మాణం, నిర్వహణ చేపట్టిన ఈ ప్రాజెక్టు కోవిడ్ అనంతరం ఎదురైన ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కొత్త నిర్వహణ నమూనా అవసరమైంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో తెలంగాణ ప్రభుత్వం మెట్రో ఫేజ్--1ను తన ఆధీనంలోకి తీసుకుంది. ఇప్పుడీ ప్రాజెక్టును జైపూర్ నమూనాలో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి భాగస్వామ్యంతో నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జైపూర్‌లో మెట్రో వ్యవస్థ ప్రారంభంలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగినా, తరువాత కేంద్ర మెట్రో విధానానికి అనుగుణంగా కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త సంస్థగా మారింది. ప్రస్తుతం అక్కడ ఫేజ్--2 విస్తరణ పనులు



50:50 భాగస్వామ్యంతో కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌లో కూడా అదే తరహా నమూనా అమలైతే మెట్రో విస్తరణకు అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం, పరిపాలనా సమన్వయం మరింత బలోపేతం కానున్నాయి. నగర రవాణా వ్యవస్థను మరింత విస్తరించేందుకు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మెట్రో నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయడానికి ఈ నిర్ణయాలు కీలక మలుపుగా మారనున్నాయని అధికారులు భావిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలి

ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం ఢిల్లీలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి తెలంగాణ రైతుల తరపున వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, రైతుల అవసరాలు, నిల్వ మరియు మిల్లింగ్ సమస్యలపై కేంద్రానికి సమగ్ర వివరాలు అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరకు ఒక్క గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. దేశంలోనే అత్యధిక స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరిని సేకరించిందని, కొనుగోలు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని ఉత్తమ్ వెల్లడించారు. ఖరీఫ్, రబీ సీజన్లను కలిపి 2025--26 మార్కెటింగ్ సంవత్సరంలో తెలంగాణలో 152 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా వరి సేకరణ జరిగి చారిత్రాత్మక రికార్డు నమోదైందన్నారు. రైతులు భారీగా వరి సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్న నేపథ్యంలో కేంద్రం కూడా వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రబీ 2025--26 సీజన్‌కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ అంచనాలను సమర్పించినప్పటికీ, కేంద్రం కేవలం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే లక్ష్యంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఇది సుమారు 51.47 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానమని చెప్పారు. గత మూడు సీజన్లలో కేంద్రం నిర్దేశించిన లక్ష్యాలకు మించి రాష్ట్రం 69.50 లక్షల మెట్రిక్ టన్నుల వరిని అదనంగా కొనుగోలు చేయాల్సి వచ్చిందని వివరించారు. ఈ కారణంగా రాష్ట్ర ఖజానాపై రూ.16,446 కోట్ల అదనపు భారం పడిందని పేర్కొన్నారు. ధాన్యం సేకరణతో పాటు సీఎంఆర్ సరఫరా విషయంలోనూ రాష్ట్రం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గోదాముల కొరత, ఒకేసారి పలు సీజన్ల కొనుగోళ్లు కొనసాగడం, మిల్లింగ్ సామర్థ్యాలపై పెరుగుతున్న ఒత్తిడి కారణంగా సీఎంఆర్ సరఫరా గడువులను పొడిగించడం అత్యవసరమని వివరించారు. రబీ 2024--25 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, ఖరీఫ్ 2025--26 సీజన్‌కు సంబంధించిన గడువును 120 రోజులు పొడిగించాలని

కేంద్రాన్ని కోరారు. అదేవిధంగా రబీ 2025--26 సీజన్‌కు కేంద్రం నిర్ణయించిన 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ లక్ష్యాన్ని 54.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో రబీ సీజన్‌లో పండే వరి ప్రధానంగా ఉప్పుడు బియ్యం తయారీకి అనుకూలంగా ఉండటంతో బాయిల్డ్ రైస్ రూపంలో సరఫరా చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. రాబోయే ఖరీఫ్ 2026--27 సీజన్‌కు సంబంధించి కూడా రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే అంచనాల ఆధారంగానే సేకరణ లక్ష్యాలను నిర్ణయించాలని కేంద్రానికి సూచించారు. రైతుల ప్రయోజనాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికీ రాజీపడదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రైతులు పండించిన ప్రతి గింజకు కనీస మద్దతు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు, నిల్వ, మిల్లింగ్, సరఫరా ప్రక్రియలను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేంద్రం కూడా రాష్ట్ర పరిస్థితులను అర్థం చేసుకుని సానుకూల నిర్ణయాలు తీసుకుంటే రైతులకు మరింత భరోసా కలుగుతుందని అభిప్రాయపడ్డారు.

తెలుగు రాష్ట్రాల్లో ఈ నెలాఖరు వరకు విస్తారంగా భారీ వర్షాలు

30వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షాలు

తెలంగాణలో 5 డిగ్రీల వరకు తగ్గనున్న ఉష్ణోగ్రతలు

నేడు కోస్తాంధ్రలో, 28-30 మధ్య దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు

తెలంగాణలోని 8 జిల్లాలకు ఎల్లో అలెర్ట్

ఎండలు, ఉక్కపోతలతో ఇబ్బంది పడుతున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తీపి కబురు అందించింది. రాబోయే వారం రోజుల పాటు (జూన్ 30 వరకు) రెండు రాష్ట్రాలలోనూ నైరుతి రుతుపవనాల ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అమరావతి, హైదరాబాద్ వాతావరణ కేంద్రాలు వెల్లడించాయి. ఈ కాలంలో అనేక ప్రాంతాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉండగా.. కొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు, గంటకు 30 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ విస్తారమైన వర్షాల కారణంగా రాబోయే రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే.. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాలతో కూడిన ఉత్తర కోస్తా ప్రాంతాలలో నేడు (24న) అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. 29, 30 తేదీలలో ఇక్కడ వర్షాల తీవ్రత మరింత పెరగొచ్చని అంచనా వేస్తున్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు వంటి దక్షిణ కోస్తా జిల్లాలలో ప్రారంభంలో మోస్తరు వర్షాలు ఉండి, జూన్ 28 నుండి 30 మధ్య విస్తారంగా భారీ వర్షాలు కురిసే వీలుంది. రాయలసీమ ప్రాంతంలో ఆరంభంలో తక్కువగా ఉన్నప్పటికీ, వారం చివర్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. తెలంగాణలో నేడు (24న) ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ సహా ఎనిమిది జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వారం చివరి నాటికి హైదరాబాద్, రంగారెడ్డితో పాటు దక్షిణ జిల్లాలకు కూడా ఈ వర్షాలు విస్తరించనున్నాయి.

ప్రజాకేంద్రీకృత పరిపాలనే అభివృద్ధికి పునాది

మంత్రిత్వ శాఖల్లో సహాయ కార్యదర్శులుగా నియమితులైన 2024 బ్యాచ్‌కు చెందిన 183 మంది ఐఏఎస్ అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో ప్రధాని ఈ సందేశాన్ని ఇచ్చారు. పరిపాలన అనేది కేవలం ఫైళ్లు, గణాంకాలు లేదా అధికారిక ప్రక్రియలకే పరిమితం కాదని, ప్రతి ఫైలు వెనుక ప్రజల ఆశలు, ఆందోళనలు, భవిష్యత్తు దాగి ఉంటుందని మోదీ పేర్కొన్నారు. అధికారుల ముందుకు వచ్చే ప్రతి దస్త్రం అనేక మంది పౌరుల జీవితాలను ప్రభావితం చేస్తుందని గుర్తుంచుకోవాలని సూచించారు. అందువల్ల తీసుకునే ప్రతి నిర్ణయంలో ప్రజా ప్రయోజనాలు ప్రధాన ప్రమాణంగా ఉండాలని చెప్పారు. సహానుభూతి, సమయోచిత స్పందన, కలుపుగోలుతనం వంటి లక్షణాలు పరిపాలనలో అత్యంత కీలకమని ప్రధాని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని త్వరితగతిన పరిష్కారాలు అందించగలిగితేనే పరిపాలనపై విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ప్రభుత్వ విధానాల అమలు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని సూచించారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించాలన్న సంకల్పాన్ని మరోసారి ప్రస్తావించిన ప్రధాని, రాబోయే దశాబ్దాల్లో తీసుకునే విధానపరమైన మరియు పరిపాలనా నిర్ణయాలు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తాయని చెప్పారు. ప్రతి అధికారి తన బాధ్యతలను జాతీయ అభివృద్ధి దృక్పథంతో నిర్వర్తించాలని కోరారు. పరిపాలనలో నాణ్యత, పారదర్శకత, ప్రజా భాగస్వామ్యాన్ని పెంపొందించడం ద్వారా అభివృద్ధి వేగవంతం అవుతుందని వివరించారు. డేటాను కేవలం సంఖ్యల సమాహారంగా చూడకూడదని మోదీ సూచించారు. ప్రతి గణాంకం వెనుక ప్రజల జీవన పరిస్థితులు, సవాళ్లు, ఆకాంక్షలు దాగి ఉంటాయని గుర్తించాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలు, విధానాలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయా లేదా అన్న విషయాన్ని నిరంతరం సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకున్నప్పుడే సమర్థవంతమైన పాలన సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. జాతి నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత ముఖ్యమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఐఏఎస్ 2024 బ్యాచ్‌లో సుమారు 40 శాతం మంది మహిళలు ఉండటం దేశంలో మహిళల సాధికారతకు నిదర్శనమని చెప్పారు. పరిపాలనలో మహిళల భాగస్వామ్యం పెరగడం దేశాభివృద్ధికి మరింత బలం చేకూరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా ప్రపంచ భద్రతా పరిస్థితులపై కూడా ప్రధాని తన అభిప్రాయాలను వెల్లడించారు. మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల్లో బ్రిక్స్ కూటమి దేశాలు పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఉగ్రవాదం, సైబర్ నేరాలు, భద్రతా సవాళ్లను సమష్టిగా ఎదుర్కొనే దిశగా సభ్య దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం బ్రిక్స్ కూటమికి అధ్యక్షత వహిస్తున్న భారత్ సభ్య దేశాల మధ్య ఆచరణాత్మక సహకారాన్ని పెంపొందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. ప్రపంచ భద్రత, ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రయోజనాల పరిరక్షణలో బ్రిక్స్ కీలక పాత్ర పోషించగలదని ప్రధాని అభిప్రాయపడ్డారు. దక్షిణార్ధ గోళ దేశాల ప్రాధాన్యాలకు మద్దతు ఇవ్వడం, ప్రపంచ స్థాయిలో సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడం భారత లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదే సమావేశాల సందర్భంగా జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ మాట్లాడుతూ హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడం ప్రపంచ ఇంధన భద్రతకు సానుకూల పరిణామమని పేర్కొన్నారు. మరోవైపు, పరస్పర ప్రయోజనాలు, భద్రతా అంశాలను భారత్-చైనా దేశాలు గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ అభిప్రాయపడ్డారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో అంతర్జాతీయ సహకారం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సమావేశాల్లో నాయకులు అభిప్రాయపడ్డారు.

కొత్త సీఎస్‌గా సంజయ్ జాజు!

మంగళవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్ర అత్యున్నత పరిపాలనా పదవికి సంజయ్ జాజు పేరు దాదాపు ఖరారైనట్లు ఉన్నతస్థాయి వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న కె. రామకృష్ణారావు పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో కొత్త సీఎస్ ఎంపికపై గత కొంతకాలంగా ఉత్కంఠ కొనసాగుతోంది. 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారులు జయేశ్ రంజన్, వికాస్‌రాజ్ పేర్లు ప్రధానంగా వినిపించాయి. వీరిద్దరిలో ఒకరికి అవకాశం లభించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు భావించాయి. అయితే అనూహ్యంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న సంజయ్ జాజును తెలంగాణ కేడర్‌కు తిరిగి పంపాలని కోరడం పరిపాలనా వర్గాల్లో చర్చనీయాంశమైంది. కేంద్రం కూడా ఈ ప్రతిపాదనకు వెంటనే ఆమోదం తెలపడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు మరింత బలం చేకూరినట్లు భావిస్తున్నారు. ఈ పరిణామం రాష్ట్ర పాలనా వ్యవస్థలో కొత్త దిశను సూచిస్తోందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. సంజయ్ జాజు దాదాపు 12 సంవత్సరాల తర్వాత సొంత కేడర్‌కు తిరిగి వస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం ఆయన కేంద్ర సర్వీసులకు వెళ్లి వివిధ కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంతకుముందు సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో ఆయన పలు కీలక పదవులను విజయవంతంగా నిర్వహించారు. ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శిగా, జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా, విశాఖపట్టణం కమిషనర్‌గా, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా, సహాయ పునరావాస శాఖ కమిషనర్‌గా, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి శాఖ కమిషనర్‌గా, ఏపీఐఐసీ ఉపాధ్యక్షుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందించారు. పరిపాలనా అనుభవం, విధానాల రూపకల్పనలో నైపుణ్యం, కేంద్ర-రాష్ట్ర స్థాయిలలో పనిచేసిన అనుభవం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను తిరిగి కేడర్‌కు పిలిపించుకోవడం వెనుక వ్యూహాత్మక ఆలోచన ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే సంవత్సరాల్లో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు, మౌలిక సదుపాయాల విస్తరణ, పెట్టుబడుల ఆకర్షణ, పరిపాలనా సంస్కరణలు వంటి కీలక అంశాల అమలులో అనుభవజ్ఞుడైన అధికారిని నియమించాలని ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. సంజయ్ జాజు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరిస్తే 2029 ఫిబ్రవరి వరకు పదవిలో కొనసాగే అవకాశం ఉంది. దీర్ఘకాలం పాటు సీఎస్‌గా సేవలందించే అవకాశం ఉండటంతో పరిపాలనా వ్యవస్థలో స్థిరత్వం, సమన్వయం పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రధాన అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఆయన కీలక పాత్ర పోషించనున్నారని అంచనా వేస్తున్నారు. సంజయ్ జాజు రాకతో రాష్ట్ర పాలనా వ్యవస్థలో మరిన్ని కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల బదిలీలు, శాఖల పునర్వ్యవస్థీకరణ, పరిపాలనా ప్రాధాన్యతల్లో మార్పులు వంటి అంశాలపై కూడా త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ పరిపాలనలో కొత్త అధ్యాయానికి ఇది నాంది కావచ్చునే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

విరిసిన పద్మాలు

గుర్తింపు లభించింది. అలాగే పశుసంవర్ధక రంగంలో విశేష సేవలు అందించిన మామిడి రమారెడ్డికి ప్రకటించిన పద్మశ్రీ పురస్కారాన్ని ఆయన తరపున భార్య శ్యామలారెడ్డి స్వీకరించారు. భారతీయ సినీ రంగానికి చెందిన మరికొందరు ప్రముఖులు కూడా ఈ వేడుకలో సత్కారం అందుకున్నారు. మలయాళ సినీ పరిశ్రమలో అగ్రనటుడిగా దశాబ్దాలుగా విశేష గుర్తింపు పొందిన మమ్ముట్టిని కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. తన అద్భుత నటనతో దేశవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్న నటుడు ఆర్. మాధవన్‌కు పద్మశ్రీ పురస్కారం లభించింది. భారతీయ సినిమా అభివృద్ధికి వారి కృషిని కేంద్రం గుర్తించింది. క్రీడారంగంలో భారత క్రికెట్‌కు విశేష సేవలు అందించిన జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో అనేక విజయాలను అందించి భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ క్షణాలను అందించిన ఆయన సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని ప్రదానం చేశారు. ప్రపంచ క్రికెట్‌లో భారత ప్రతిష్ఠను మరింత పెంచిన క్రీడాకారుడిగా రోహిత్ శర్మ ప్రత్యేక గుర్తింపు పొందారు. పద్మ పురస్కారాలు కేవలం వ్యక్తిగత గౌరవాలే కాకుండా దేశాభివృద్ధికి తమ జీవితాలను అంకితం చేసిన వ్యక్తుల సేవలకు దేశం అందించే కృతజ్ఞతా చిహ్నమని కార్యక్రమంలో పలువురు అభిప్రాయపడ్డారు. వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన వ్యక్తులను ప్రోత్సహిస్తూ భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చేలా ఈ అవార్డులు నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

హర్మూజ్ జలసంధిలో రికార్డు స్థాయిలో ఆయిల్ రవాణా: ట్రంప్

భవిష్యత్తులో అత్యున్నత స్థాయి అణు తనిఖీలకు ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ అణు కార్యకలాపాలపై పారదర్శకతకు ఇది భరోసా ఇస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఒకవేళ ఇరాన్ ఈ నిబంధనలకు కట్టుబడి ఉండకపోతే, తదుపరి చర్చలకు తావుండదని హెచ్చరించారు. ఇరాన్ చేసిన కొన్ని ప్రతిపాదనల ప్రాతిపదికన, ఎలాంటి దిగ్బంధనం లేకుండా హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు తాను అంగీకరించినట్లు ట్రంప్ వివరించారు. ఒకవేళ తిరిగి దిగ్బంధనాన్ని విధిస్తే నౌకల రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోతాయని, అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో అటువంటి అవసరం రాకపోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒప్పందంలో భాగంగా అమెరికా విడుదల చేసే నిధులను ఇరాన్ కేవలం ఆహారం, వైద్య సామగ్రి వంటి అత్యవసరాల కోసమే వినియోగించగలదని, వాటిని కూడా కేవలం అమెరికా నుంచే కొనుగోలు చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ సముద్ర వాణిజ్యంలో దాదాపు 20 శాతం చమురు రవాణా సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ వంటి దేశాల నుంచి హర్మూజ్ జలసంధి ద్వారానే సాగుతుంది. గత కొంతకాలంగా ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలు, దిగ్బంధనాల కారణంగా ఈ మార్గంలో చమురు సరఫరాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడి ధరలు పెరిగాయి. అయితే, తాజా ఒప్పందంలో భాగంగా అణు తనిఖీలకు ఇరాన్ సమ్మతించడంతో ప్రాంతీయ ఉద్రిక్తతలు సద్దుమణిగాయి.

మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు: కేటీఆర్

రాష్ట్రంలో ప్రస్తుతం ఆర్ఆర్ ట్యాక్స్ నడుస్తోందని ఆరోపణ

రియల్ ఎస్టేట్ రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శ

మెట్రో వ్యవహారంలో రేవంత్, కిషన్‌రెడ్డి నాటకాలు ఆడుతున్నారని వ్యాఖ్య

హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, మళ్లీ కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. మంగళవారం మియాపూర్‌లో నిర్వహించిన శేరిలింగంపల్లి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం రాహుల్--రేవంత్‌రెడ్డి ట్యాక్స్ నడుస్తోందని ఆరోపించారు. కొందరు ఐఏఎస్ అధికారులు దళారులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందన్నారు. హైదరాబాద్ మెట్రోకు సంబంధించిన భూములు, అప్పుల వ్యవహారంపై ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించిన కేటీఆర్, ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం మోపారని ఆరోపించారు. మెట్రో విస్తరణ అంశంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిసి రాజకీయ నాటకాలు ఆడుతున్నారని వ్యాఖ్యానించారు. మహిళలకు ఎన్నికల హామీగా ప్రకటించిన నెలకు రూ.2,500 సాయాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేసిన ఆయన, ఇప్పటివరకు బకాయిగా ఉన్న మొత్తాన్ని జమ చేయాలని కోరారు. హామీ ప్రకారం మొత్తం చెల్లిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయి నుంచి ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

యూరియా కోసం రైతుల ఆందోళన

- ఏవోను నిలదీసిన అన్నదాతలు
- ముందే బుకింగ్ చేసుకున్నారంటూ ఆరోపణ
- సాంకేతిక సమస్యే కారణమన్న వ్యవసాయాధికారి పద్మజ

తొలివెలుగు, రాజాపేట: మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. యూరియా పంపిణీలో అక్రమాలు జరిగాయంటూ రైతులు మండల వ్యవసాయ అధికారి (ఏవో) పద్మజను నిలదీశారు. అధికారులే తప్పుడు సమాచారం ఇచ్చి యూరియాను పక్కదారి పట్టించారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. మంగళవారం ఉదయం యాప్ ద్వారా యూరియా బుకింగ్ చేసుకోవాలని ఏవో పద్మజ రైతులకు ముందుగా సమాచారం ఇచ్చారు. అయితే, కొందరు రైతులకు సోమవారమే (ముందు రోజే) బుకింగ్ చేసుకునే సదుపాయం కల్పించారని అన్నదాతలు ఆరోపించారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు యాప్ పనిచేయకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులే కావాలని కొందరికి యూరియాను అమ్ముకున్నారని మండిపడ్డారు.

అమ్ముకోలేదు.. సాంకేతిక లోపమే: ఏవో

రైతుల ఆందోళనపై ఏవో పద్మజ వివరణ ఇస్తూ.. పాత నిల్వలకు సంబంధించిన 57 బస్తాలను 22వ తేదీన బుకింగ్ చేసుకునేందుకు జిల్లా అధికారులు అనుమతించారని తెలిపారు. 23న ప్రారంభం కావాల్సిన కొత్త బుకింగ్ సాంకేతిక కారణాల వల్ల సాయంత్రం 3 గంటల వరకు ఆలస్యమైందని, అంతేకానీ తానేమీ యూరియా అమ్ముకోలేదని స్పష్టం చేశారు. మండలంలో రేణిగుంట పీఏసీఎస్, కాల్వపల్లి పీఏసీఎస్, రాజాపేట ఆగ్రో రైతు సేవా కేంద్రం, మన గ్రోమోర్ సెంటర్ల ద్వారా పారదర్శకంగా పంపిణీ జరుగుతుందని, పట్టాదారు పాస్ పుస్తకంలో నమోదైన ఫోన్ నంబర్ ద్వారా రైతులు యాప్‌లో బుక్ చేసుకోవాలని కోరారు.

రాజాపేట తహసీల్దార్‌గా రవి కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

- పారదర్శక సేవలకు ప్రాధాన్యం
- భూ సమస్యల పరిష్కారానికి కృషి
- ఘనంగా సత్కరించిన అధికారులు, నాయకులు

తొలివెలుగు, రాజాపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల నూతన తహసీల్దార్‌గా జి. రవి కిరణ్ కుమార్ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కార్యాలయ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంఆర్ఓ మాట్లాడుతూ.. మండల ప్రజలకు త్వరితగతిన, అత్యంత పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా పేదలు, రైతులకు సంబంధించిన భూ సమస్యలు, వివిధ రకాల సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు. కార్యాలయానికి వచ్చే దరఖాస్తులను నిబంధనల ప్రకారం సానుకూలంగా పరిశీలించి, గడువులోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా, బాధ్యతలు చేపట్టిన నూతన తహసీల్దార్ రవి కిరణ్ కుమార్‌ను మండల అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు.

సూర్య గిరి ఎల్లమ్మ ఆలయంలో వింత పూజలు...!

తన భర్త తన నుండి దూరం చెయ్యొద్దని భర్త ఫోటో పెట్టీ పూజలు చేసిన ఓ భక్తురాలు

పూజలు చేస్తుండగా చూసి ఆందోళన చేందిన భక్తులు

మహేశ్వరం : మహేశ్వరం మండలం రావిర్యాలలో స్వయంభువై వెలిసిన శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో వింత ఘటన చోటు చేసుకుంది..ప్రతి మంగళవారం అమ్మవారి దర్శనానికి వేలాదిగా భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు.అదే తరుణంలో ఓ భక్తురాలు తన భర్త మరొక మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని తనకు దక్కకుండా చేస్తుందని..ఆవేదనతో భర్త పోలో,మరొక మహిళ ఫోటో తోపాటు ఒక తాడు పసుపు కుంకుమ వేసి పూజ చేస్తుండగా అక్కడికి వచ్చిన భక్తులు ఆందోళన చెందారు..వెంటనే ఆలయ సిబ్బందికి సమాచారమివ్వడంతో వెంటనే ఆమెను బయటకు పంపించారు.ఆలయ ప్రాంగణంలో ఎవరైనా భక్తులకు ఇబ్బంది కలిగించే అసాంఘిక కార్యక్రమాలు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని ఆలయ ఈవో తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

- పెద్దగూడెంలో ఉచిత మెగా వైద్య శిబిరం
- హాజరైన మాజీ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ లత
- 200 మందికి పరీక్షలు.. ఉచితంగా మందుల పంపిణీ

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని చేరువ చేస్తూ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ ఫక్కీరు లతా నర్సిరెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని పెద్దగూడెం గ్రామంలో మంగళవారం లయన్స్ క్లబ్ హయత్ నగర్ స్టార్స్ ఆధ్వర్యంలో, మలక్‌పేట్ యశోద ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిపుణులైన వైద్య బృందం సుమారు 200 మంది గ్రామీణులకు జనరల్, గుండె, ఆర్థోపెడిక్ (కీళ్ల నొప్పులు), బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి రవీందర్ రావు, హయత్ నగర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మన్నే నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రవీందర్ రెడ్డి, కోశాధికారి వాకిటి నరసింహారెడ్డి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కట్ట నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి పునరంకితం కావాలి

- కుర్రారంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం
- యువతను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదే: ఎస్ఐ లింగారెడ్డి

తొలివెలుగు, రాజాపేట: మాదకద్రవ్యాల నివారణతోనే నవ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని రాజాపేట ఎస్ఐ లింగారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నివారణ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల పరిధిలోని కుర్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, ఆయా కుటుంబాలు ఎదుర్కొనే ఆర్థిక, సామాజిక ఇబ్బందులను కూలంకుశంగా వివరించారు. కుర్రారం గ్రామాన్ని మాదకద్రవ్యాల రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ మాట్లాడుతూ.. పిల్లలు చెడు మార్గాల వైపు వెళ్లకుండా చూడటంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డు భాస్కర్, ఉపసర్పంచ్ రావి కొండల్ రెడ్డి, జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కోటిరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరసింహులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాధ, అంగన్‌వాడీ టీచర్ స్వప్న, వార్డు సభ్యులు యూసఫ్, స్వరూప, దీవెన, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమికొట్టాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'నషా ముక్తి భారత్'
- విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ తులసి

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: సమాజానికి చీడపురుగులా పట్టిన డ్రగ్స్ మహమ్మారిని అందరూ కలిసికట్టుగా తరిమికొట్టాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ తులసి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నషా ముక్తి భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం పురపాలక కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆమె ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ తులసి మాట్లాడుతూ.. ఎంతోమంది విద్యార్థులు, యువత మత్తు పదార్థాల బారిన పడి తమ అమూల్యమైన జీవితాలను బలి చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎలాంటి వ్యసనాలకు లోనుకాకుండా, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సాయి వర్ధన్, జ్యోతి, అధ్యాపకులు శివశంకర్, వెంకట్ రెడ్డి, వెంకటేష్, రేణుక దేవి, స్వాతి, చందన, శ్రీదేవి, మురళీకృష్ణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే విద్యావ్యవస్థకు పట్టుకొమ్మలు

- విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ
- దాత మాధవరెడ్డి సేవలు అభినందనీయం: ఎంఈఓ రమేష్

తొలివెలుగు, రాజాపేట: ప్రభుత్వ పాఠశాలలే విద్యావ్యవస్థకు అసలైన పట్టుకొమ్మలని రాజాపేట మండల విద్యాధికారి (ఎంఈఓ) చందా రమేష్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కుర్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెంటపర్తి మాధవరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ ఉచితంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత సదుపాయాలతో పాటు, దాతలు కూడా ముందుకొచ్చి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. మాధవరెడ్డిని ఆదర్శంగా తీసుకుని మరికొందరు విద్యాదానానికి ముందుకు రావాలని కోరారు. దాత మాధవరెడ్డి మాట్లాడుతూ.. తన 40 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమందిని ఉన్నత స్థానాల్లో చూశానని, మాతృగ్రామ పాఠశాల అభివృద్ధికి తనవంతుగా స్పోర్ట్స్ మెటీరియల్‌తో పాటు ఇతర అవసరాలకు ఎల్లప్పుడూ ముందుంటానని హామీ ఇచ్చారు. ఎస్ఐ లింగారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న మాధవరెడ్డి అందరికీ మార్గదర్శకుడని కొనియాడారు. సర్పంచ్ బొడ్డు భాస్కర్, ఉపసర్పంచ్ రావి కొండల్ రెడ్డి దాత సేవలను అభినందించారు. ఈ కార్యక్రమానికి జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు కోటిరెడ్డి అధ్యక్షత వహించగా.. ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరసింహులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రాధ, అంగన్‌వాడీ టీచర్ స్వప్న, ఉపాధ్యాయులు పరమేష్, రాజు, శివరాజు, జయశీల, సుధారాణి, అరుణజ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ బాధితులకు నష్టపరిహార చెక్కుల పంపిణీ

- ధర్మారెడ్డి-పిల్లాయిపల్లి కాల్వ భూబాధితులకు నష్టపరిహారం
- భూసేకరణ బాధితులకు నష్టపరిహార చెక్కుల పంపిణీ
- అందజేసిన జిల్లా డిప్యూటీ కలెక్టర్ జగన్నాథరావు

తొలివెలుగు, రామన్నపేట: ధర్మారెడ్డి-పిల్లాయిపల్లి కాల్వ నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ నష్టపరిహారం చెక్కులను మంగళవారం రైతులకు అందజేశారు. రామన్నపేట మండల కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ కలెక్టర్ జగన్నాథరావు భూబాధిత రైతులకు ఈ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ.. కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోయిన వివిధ గ్రామాల రైతులకు పూర్తి పారదర్శకంగా నష్టపరిహారం చెల్లిస్తున్నట్లు తెలిపారు. రామన్నపేట మండలంలోని వెల్లంకి, కొమ్మాయిగూడెం, చౌటుప్పల్ మండలంలోని లింగోజీగూడెం, అలాగే భూదాన్ పోచంపల్లి మండలంలోని జిబ్లక్‌పల్లి, హైదర్ గూడ రైతులకు ఇప్పటివరకు రూ.1.59 కోట్ల విలువైన నష్టపరిహారపు చెక్కులను అందజేశామని వివరించారు. అర్హులైన రైతులందరికీ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, నీటిపారుదల శాఖల సీనియర్ అసిస్టెంట్ సుగుణ, ఏఈ తరుణ్ తేజ, జీపీఓ భిక్షపతి, డీఎల్ఎస్ తులసి, సోని తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు

- కండువా కప్పి ఆహ్వానించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: గిరాజ్ మహేష్

తొలివెలుగు, రాజాపేట: మండల పరిధిలోని లక్ష్మక్కపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గిరాజ్ మహేష్ తన అనుచరులతో కలిసి మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మహేష్‌కు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గిరాజ్ మహేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నాయకత్వంపై నమ్మకంతోనే కాంగ్రెస్‌లో చేరినట్లు వెల్లడించారు. మండలంలో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నమిల మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగా నరేష్ గౌడ్, జిల్లా కార్యదర్శి పిట్టల జయరాములు, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మున్సిపల్ చైర్మన్‌కు సీఐటీయూ వినతిపత్రం
- కనీస వేతనం రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్
- సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలకు హెచ్చరిక

తొలివెలుగు, చౌటుప్పల్: చౌటుప్పల్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి ఎండి పాషా డిమాండ్ చేశారు. కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం సీఐటీయూ నాయకులతో కలిసి మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండి పాషా మాట్లాడుతూ.. పట్టణ పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో మున్సిపల్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ వారి సమస్యలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటం విచారకరమన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం, మున్సిపల్ యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ ప్రధాన డిమాండ్లలో మున్సిపల్ సిబ్బందిని వెంటనే రెగ్యులరైజ్ చేయడం, రెండో పీఆర్‌సీలో కనీస వేతనం రూ.25 వేలుగా నిర్ణయించడం, అన్ని విభాగాల కార్మికులకు డీఏతో పాటు ఎనిమిది గంటల పని విధానాన్ని కచ్చితంగా అమలు చేయడం ఉన్నాయి. అలాగే ఐఎఫ్‌ఎంఐఎస్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను వెంటనే చేర్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పదవీ విరమణ ప్రయోజనాలు, ఆరోగ్య బీమా సదుపాయం కల్పించడంతో పాటు, మరణించిన కార్మికుల దహన సంస్కారాలకు రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని కోరారు. కార్మికుల సమస్యలపై మున్సిపల్ యంత్రాంగం సానుకూలంగా స్పందించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, లేకపోతే కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బత్తుల దాసు, గంగాదేవి అంజయ్య, దొనకొండ యాదయ్య, నీలిరొడ్డ నరసింహ, తూర్పునూరు మల్లేశం, మంచాల విజయ, మంచాల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటంతోనే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ రద్దు

- అధికార పార్టీ నేతలవి అబద్ధపు గొప్పలు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

తొలివెలుగు, రామన్నపేట: అన్ని వర్గాల ప్రజల సుదీర్ఘ పోరాటం వల్లే రామన్నపేటలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు నిర్ణయం రద్దయిందని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్ పరిశ్రమ వల్ల ఈ ప్రాంతం కాలుష్యమయంగా మారుతుందని గమనించి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తొలి నుంచి తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నాలతో పాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశామని గుర్తుచేశారు.

అరెస్టులు చేసినా వెనకడుగు వేయలేదు:

ప్రజాభిప్రాయ సేకరణ (పబ్లిక్ హియరింగ్) రోజున మాజీ ఎమ్మెల్యే అయిన తనతో పాటు ఎందరో నేతలను అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేసినా కార్యకర్తలు, ప్రజలు వెనకడుగు వేయకుండా నిరసనలు తెలిపారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు, మేధావులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఐక్యత వల్లే ఏడాది క్రితమే అదానీ సంస్థ ఇక్కడ ఫ్యాక్టరీ పెట్టడం లేదని ప్రకటించిందని స్పష్టం చేశారు. అయితే, కాంగ్రెస్ నాయకులు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించి, తామే కంపెనీని అడ్డుకున్నామంటూ పాలాభిషేకాలు చేసుకోవడం, స్వీట్లు పంచుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.

రైతాంగాన్ని విస్మరించారు:

ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసిందని చిరుమర్తి లింగయ్య విమర్శించారు. గ్రామాల్లో ఇప్పటికీ ధాన్యం రాశులు కుప్పలుగా పేరుకుపోయినా కొనుగోలు చేయడం లేదన్నారు. రైతుబంధు, రైతుబీమా అందడం లేదని, మార్కెట్‌లో యూరియా కొరత, నకిలీ విత్తనాల హల్‌చల్‌తో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పోషబోయిన మల్లేశం, పల్లివాడ సర్పంచ్ కంభంపాటి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు వేమవరం సుధీర్ బాబు, పున్న వెంకటేశం, ఎండీ ఆమీర్, జిల్లా నాయకులు బద్దుల రమేష్, ఎస్.కె చాంద్, జాడ సంతోష్, బొడ్డు అలయ్య, ఎండీ అజాజ్ ఖాన్, జాల అమరేందర్ రెడ్డి, చెరుకు ఉపేందర్ పాల్గొన్నారు.

సిరిపురంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ 'బలిదాన్ దివస్'

- ఘనంగా నివాళులర్పించిన బిజెపి శ్రేణులు
- ప్రధాని మోడీ సుపరిపాలనతోనే దేశాభివృద్ధి: జక్కల రాజు
- గ్రామంలో మొక్కలు నాటిన నాయకులు

తొలివెలుగు, రామన్నపేట: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో బుధవారం భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆధ్వర్యంలో డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ సుపరిపాలనను పురస్కరించుకుని గ్రామంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన బిజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కల రాజు, ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్ మాట్లాడుతూ.. అంత్యోదయ సిద్ధాంతమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోడీ దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. 'సబ్కా సాత్.. సబ్కా వికాస్.. సబ్కా విశ్వాస్' నినాదంతో సమాజంలోని చివరి వ్యక్తికి కూడా ఆర్థిక ఫలాలు అందేలా కేంద్రం పథకాలను అమలు చేస్తోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ, స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య, మండల ఇన్‌ఛార్జ్ కొరివి శంకర్, సీనియర్ నాయకులు ఏళ్ల సంజీవరెడ్డి, రాపోలు స్వామి, సిరిపురం ఉపసర్పంచ్ మూడుదుడ్ల అనూష రమేష్, మండల ప్రధాన కార్యదర్శులు జంగిలి సత్యనారాయణ, బెజ్జంకి శివకుమార్, మండల ఉపాధ్యక్షుడు బట్టే రమేష్, అక్కెనపల్లి సైదులు, పొడాల లక్ష్మి, బడుగు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే సిమెంట్ పరిశ్రమ ఉపసంహరణ

- రామన్నపేట ప్రజల విజయం: సిపిఎం నేతలు
- పర్యావరణ పరిరక్షణకు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలి

తొలివెలుగు, రామన్నపేట: రామన్నపేట ప్రాంతంలో ప్రతిపాదించిన ఆదానీ-అంబుజా సిమెంట్ పరిశ్రమను ఉపసంహరించుకోవడం ముమ్మాటికీ ప్రజా ఉద్యమ విజయమేనని సిపిఎం నాయకులు అభివర్ణించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య మాట్లాడారు. ప్రజల ఐక్య పోరాటం ఎన్నడూ వృథా కాదని రామన్నపేట ప్రాంత ప్రజలు మరోసారి నిరూపించారని కొనియాడారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా..:

ఈ ప్రతిపాదిత పరిశ్రమ వల్ల పర్యావరణంతో పాటు భూగర్భ జలాలు, వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బతింటాయని, ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని తాము ముందే హెచ్చరించామన్నారు. అఖిలపక్షాలు, ప్రజాసంఘాలు, రైతులు, మహిళలు, యువత కలిసి పర్యావరణ పరిరక్షణ కమిటీ

ఆధ్వర్యంలో నడిపిన నిరంతర పోరాటమే ఈ విజయానికి కారణమన్నారు. ఈ సందర్భంగా ఉద్యమానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ రంగ పరిరక్షణ, ఉపాధి కల్పనపై పార్టీలకతీతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్గురి అంజయ్య, కూరెళ్ళ నర్సింహా చారి, కందుల హనుమంతు, కల్లూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుడికి ఆర్థిక సహాయం అందజేత

- రూ.10 వేలు అందజేసిన కాంగ్రెస్ నాయకుడు రవీంద్ర
- పరామర్శించిన పార్టీ శ్రేణులు

తొలివెలుగు, వలిగొండ: ప్రమాదవశాత్తు గాయపడిన వలిగొండ పట్టణ కేంద్రానికి చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు పోలేపాక రాములుకు కాంగ్రెస్ నాయకుడు రవీంద్ర ఆర్థిక సహాయం అందించి తన ఉదారతను చాటుకున్నారు. ఇటీవల రాములు కాలు విరగడంతో నిస్సహాయ స్థితిలో ఉన్న ఆయన కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ?ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకుడు రవీంద్ర మంగళవారం బాధితుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, తక్షణ సహాయం కింద రూ.10,000/- నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అధైర్యపడవద్దని, అన్ని వేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తిని సహదేవ్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు, నాయకుడు కాసుల వెంకటేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల్లో విత్తన మేళా ప్రారంభం

- వలిగొండ, ప్రొద్దుటూరులో రైతులకు నాణ్యమైన విత్తనాల అందుబాటు
- ఈ నెల 30 వరకు మేళా నిర్వహణ.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచన
- సన్న రకాల వరి సాగు చేసిన వారికి క్వింటాకు రూ.500 బోనస్: ఏవో అంజనీ దేవి
- ఎల్‌నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై వ్యవసాయ శాఖ దృష్టి

తొలివెలుగు, వలిగొండ: మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వలిగొండ, ప్రొద్దుటూరు రైతు వేదికల్లో మంగళవారం విత్తన మేళా ఘనంగా ప్రారంభమైంది. ఈ మేళా ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కొనసాగనున్నట్లు మండల వ్యవసాయ అధికారి (ఏవో) అంజనీ దేవి తెలిపారు. రైతులకు నాణ్యమైన, సర్టిఫైడ్ విత్తనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. మేళాలో వరి, కంది తదితర పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు తమ భూముల స్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అధికారికంగా సూచించిన ఎనిమిది రకాల సన్న వరి వంగడాలను సాగు చేసిన రైతులకు మాత్రమే క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ అందజేస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రభుత్వం సూచించిన రకాలనే సాగు చేయాలని కోరారు. ఈ వానాకాలం సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ హెచ్చరించింది.

దీంతో రైతులు పూర్తిగా వరి పంటపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయంగా పప్పు దినుసులు, అపరాల సాగుపై దృష్టి సారించాలని సూచించింది. రైతులకు పంటల ఎంపిక, విత్తనాల వినియోగం, సాగు పద్ధతులపై ఏవైనా సందేహాలు ఉంటే రైతు వేదికల్లో అందుబాటులో ఉన్న వ్యవసాయ అధికారులను సంప్రదించి సలహాలు, సూచనలు పొందాలని ఏవో అంజనీ దేవి తెలిపారు. రైతులు విత్తన మేళాను సద్వినియోగం చేసుకుని మెరుగైన దిగుబడులు సాధించాలని ఆమె ఆకాంక్షించారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండి.. భవిష్యత్తును కాపాడుకోవాలి

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు
- విద్యార్థులతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించిన పోలీసులు
- చౌటుప్పల్ సీఐ జి. మన్మధ కుమార్

తొలివెలుగు, చౌటుప్పల్: యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల మహమ్మారికి దూరంగా ఉండి తమ బంగారు భవిష్యత్తును కాపాడుకోవాలని చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) జి.మన్మథ కుమార్ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రలోభాలకు లోనవ్వద్దు..:
ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం క్షీణించడమే కాకుండా కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు. ఎవరైనా డ్రగ్స్ వాడాలని ప్రలోభపెడితే వెంటనే తల్లిదండ్రులు, అధ్యాపకులు లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ఆకర్షణలకు లోనుకాకుండా, మంచి స్నేహితులను ఎంచుకుని చదువు, క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు.

మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ:
"నేను మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతానని, డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండడానికి కృషి చేస్తానని, డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు, అక్రమ రవాణా చేసే వ్యక్తుల సమాచారాన్ని సంబంధిత అధికారులకు తెలియజేస్తానని.. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతానని ప్రతిజ్ఞ చేయుచున్నాను." ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపక సిబ్బంది, ఎస్ఐ అజయ్ భార్గవ్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హస్తం ప్రభుత్వంలో విద్యావ్యవస్థ చిన్నచూపు: ఏబీవీపీ

- చౌటుప్పల్‌లో విజయవంతమైన పాఠశాలల బంద్
- విద్యా రంగంపై ప్రభుత్వ వైఖరికి నిరసన
- సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్

తొలివెలుగు, చౌటుప్పల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం చౌటుప్పల్ మండలంలో నిర్వహించిన పాఠశాలల బంద్ విజయవంతమైంది. విద్యా రంగానికి ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి నిరసనగా ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టగా ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు స్వచ్ఛందంగా మూతపడ్డాయి. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకుడు బతరాజు కార్తీక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖను కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెట్టిందని ఆరోపించారు. ఒకవైపు 12 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసే కుట్రలు జరుగుతుండగా, మరోవైపు ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీకి అధికారులు ప్రోత్సాహం కల్పిస్తున్నారని విమర్శించారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లోనే పుస్తకాల విక్రయాలు, ఇతర వ్యాపార కార్యకలాపాలు కొనసాగుతున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా రంగ సమస్యలపై స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేసి సీఎం నివాసాన్ని ముట్టడించేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దూసరి శివసాయి, పల్చం రిత్విక్, అభి, కొత్త సాయి, నందగిరి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలు పాటించాల్సిందే

లేకుంటే గుర్తింపు రద్దు.. సీజ్ చేస్తాం
- యాజమాన్యాలకు చౌటుప్పల్ ఎంఈఓ గురువారావు నోటీసులు
- స్కూళ్లలో పుస్తకాలు, స్టేషనరీ అమ్మితే చర్యలు

తొలివెలుగు, చౌటుప్పల్: మండలంలోని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు ఉంటాయని మండల విద్యాధికారి (ఎంఈఓ) గురువారావు హెచ్చరించారు. ఈ మేరకు మండలంలోని అన్ని ప్రైవేట్ విద్యాసంస్థలకు ఆయన అధికారిక నోటీసులు జారీ చేశారు.

తప్పనిసరిగా ఉండాల్సిన పత్రాలు ఇవే..:
- మున్సిపాలిటీ లేదా గ్రామపంచాయతీ నుంచి నిరాక్షేపణ పత్రం (ఎన్ఓసీ).
- పాఠశాల భవన పటిష్టత ధ్రువీకరణ పత్రం, అగ్నిమాపక శాఖ (ఫైర్) అనుమతి.
- పారిశుధ్య ధ్రువీకరణ పత్రంతో పాటు ట్రాఫిక్ పోలీస్ శాఖ నుంచి ఎన్ఓసీ.
- ఒకే పేరుతో ఒకటి కంటే ఎక్కువ బ్రాంచీలు నిర్వహిస్తే ప్రభుత్వ ప్రత్యేక అనుమతి తప్పనిసరి.
- స్కూల్ ప్రాంగణంలో కచ్చితంగా ఆటస్థలం ఉండాలి. విద్యార్థులను రవాణా చేసే బస్సులకు ఆర్టీఓ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ ఉండాలి.

క్యాంపస్‌లలో విక్రయాలు నిషేధం:
పాఠశాలల ప్రాంగణంలో టెక్స్ట్‌బుక్స్, నోట్‌బుక్స్, షూస్, టైలు, బెల్టులు, ఇతర స్టేషనరీ సామగ్రిని విక్రయించరాదని ఎంఈఓ స్పష్టం చేశారు. గుర్తింపు గడువు ముగిసిన పాఠశాలలు వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని, లీజ్ డాక్యుమెంట్లు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే స్కూళ్లను సీజ్ చేయడానికి వెనకాడబోమని హెచ్చరించారు.

జన్నారంలో 'మెడికల్ మాఫియా'.. సామాన్యుడి ప్రాణం గాలికి!

- పెద్ద భవనాలు.. కార్పొరేట్ సెటప్‌లు.. లోపల చూస్తే ఆర్ఎంపీలు, కంపౌండర్లు!
- మూడు రూపాయల గోలీతో.. ముప్పై రూపాయల దోపిడీ
- ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడమే అక్రమార్కులకు వరం
- జిల్లా అధికారుల 'మామూళ్ల' మత్తు.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ





తొలివెలుగు, జన్నారం: మంచిర్యాల జిల్లా చివరి సరిహద్దు మండలమైన జన్నారంలో హాస్పిటల్ మాఫియా విచ్చలవిడిగా సాగుతోంది. "మూడు పువ్వులు.. ఆరు కాయలు" అన్న చందంగా సామాన్య, నిరుపేద ప్రజల ఆరోగ్య అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు కోట్లు దండుకుంటున్నారు. మూడు రూపాయల మందు గోలీ పెట్టుబడితో ముప్పై రూపాయలు సంపాదిస్తూ.. పేద ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నారు. కార్పొరేట్ ఆసుపత్రులను తలపించేలా పెద్ద పెద్ద భవనాలు, రంగురంగుల లైట్ల సెటప్‌లతో అమాయక ప్రజలను ఆకర్షిస్తూ.. లోపల మాత్రం కనీస అర్హత లేని ఆర్ఎంపీలు, కంపౌండర్ స్థాయి వ్యక్తులతో యథేచ్ఛగా వైద్యం చేయిస్తున్నారు.

బోర్డులపై ఒకరు.. లోపల మరొకరు!
జన్నారం మండలం, పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఈ దందా మరీ ఘోరంగా తయారైంది. ఇక్కడి పలు ప్రైవేట్ ఆసుపత్రుల బోర్డులపై పెద్ద పెద్ద డిగ్రీలు (ఎంబీబీఎస్, ఎండీ) ఉన్న అర్హత కలిగిన డాక్టర్ల పేర్లు కనిపిస్తాయి. తీరా లోపలికి వెళ్లి చూస్తే.. ఆ బోర్డుల వెనుక ఉన్న అసలు డాక్టర్లు ఎక్కడా కనపడరు. వారి స్థానంలో స్టెతస్కోప్ పట్టుకునే అర్హత కూడా లేని వ్యక్తులు, ఆర్ఎంపీలు, కంపౌండర్లు డాక్టర్ల అవతారమెత్తి ఇష్టానుసారంగా హైడోస్ ఇంజెక్షన్లు, యాంటీబయోటిక్స్ రాస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

ఆదివాసుల అవసరమే పెట్టుబడిగా:
ఈ మండలంలో సుమారు యాభై వేలకు పైగా జనాభా జీవిస్తున్నారు. ఇందులో మెజారిటీ ప్రజలు మధ్యతరగతి రైతాంగం, గిరిజనులు, ఆదివాసులు, వెనుకబడిన తరగతులకు చెందినవారే. మండల కేంద్రంలో సరైన ప్రభుత్వ వైద్య సదుపాయాలు, నిపుణులైన డాక్టర్లు అందుబాటులో లేకపోవడం ఈ నకిలీ వైద్యులకు శాపంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కేంద్రానికి వెళ్లలేని పేదరికాన్ని ఆసరాగా చేసుకుని, ఈ మెడికల్ మాఫియా దర్జాగా సొంత బిల్డింగులు నిర్మించుకుని మరీ పగటిదొంగల్లా దోపిడీకి తెరలేపింది.

జిల్లా అధికారుల 'ఆర్థిక' బంధాలు?
ఈ దందా అంతా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీ ఎమ్ హెచ్ వో) అధికారుల కళ్ల ముందే జరుగుతున్నా.. వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక పెద్ద 'ఆర్థిక' బంధం ఉందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ముందే లీక్ అవుతున్న తనిఖీల సమాచారం!
జిల్లా స్థాయి అధికారులు తనిఖీల పేరుతో మండలానికి వచ్చే ముందే.. ఇక్కడి దొంగ డాక్టర్లకు ముందస్తు సమాచారం అందుతోందని స్థానికులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. అధికారులు వచ్చే సమయానికి క్లినిక్‌లకు తాళాలు వేసి పరారవ్వడం, వారు వెళ్లగానే మళ్లీ దందా మొదలుపెట్టడం ఇక్కడ నిత్యకృత్యంగా మారింది. లాలూచీ పడ్డ కొందరు అధికారులు మామూళ్ల మత్తులో సామాన్యుడి ప్రాణాలను గాలికి వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్:
ప్రాణ రక్షణ కల్పించాల్సిన వైద్య రంగం ఇలా వ్యాపార మాఫియాగా మారడంపై మండల ప్రజలు, అసలైన వైద్య నిపుణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి, జన్నారం మండలంలో తక్షణమే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. బోర్డులు మార్చి మోసాలకు పాల్పడుతున్న హాస్పిటళ్లను సీజ్ చేయాలని, నకిలీ డాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

అందంతో మత్తెక్కిస్తున్న తమన్నా

పాపం.. నాని కష్టం మాములుగా లేదు.. మధ్యాహ్నం సమయంలో వర్కవుట్స్

నేచురల్ స్టార్ నాని ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాడు. తన టాలెంట్‌తోనే స్టార్ హీరోగా ఎదిగాడు. ఇప్పుడు నిర్మాతగాను సత్తా చాటుతున్నాడు. అయితే నానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. తన ఫిజిక్‌ని కాపాడుకునేందుకు నాని ఎంత కష్టపడతాడు అనే విషయం ఇప్పుడు నెట్టింట తెగ హల్చల్ చేస్తుంది. తాజాగా హీరో నాని డైట్ గురించి ఫిట్‌నెస్ క్రియేటర్ అండ్ కోచ్ అయిన విశ్వ భరత్ కొన్ని ఆసక్తికర విషయాలు తెలియజేశారు. ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ నాని ప్రతి రోజు కూడా 12.30 గంటలకి నిద్రలేచి ఒంటి గంటకి వర్కౌట్లు మొదలుపెడతారు. అనంతరం 300-400 ఫ్రూట్ జ్యూస్ తీసుకుంటారు. ఆ జ్యూస్‌లో కొద్దిగా ఉప్పు కలుపుకుంటారు. ఆ తర్వాత పలు సప్లిమెంటరీలు తీసుకుంటారు. నాలుగు గంటల సమయంలో సాధారణ తెలుగు భోజనం చేస్తారు. ఇందులో 60 గ్రాముల రా రైస్, టమాటా లేదా తోటకూరతో కలిపి వండిన 50 గ్రాముల పప్పు, చిక్కుడుకాయ, బీరకాయ, బెండకాయ ఇలా కూరగాయలతో వండిన ఓ కూర, 150 గ్రాముల చికెన్, ఇంకా ఎగ్స్ వంటివి ఉంటాయని తెలిపారు. ఇలా భోజనం తీసుకోవడం వలన 800-900 గ్రాముల క్యాలరీస్, 60-70 గ్రాముల ప్రొటీన్ వస్తుంది. ఇక రాత్రి 9 గంటల సమయంలో ఓ ఫ్రూట్ బౌల్ లేదా 200 గ్రాముల చికెన్, ఫిష్ తీసుకుంటారు. రోజంతా హైడ్రేట్‌గా ఉండేందుకు సుమారు 4లీటర్ల నీళ్లు తాగుతారు అని చెప్పుకొచ్చారు విశ్వ భరత్.

ఎన్టీఆర్, రామ్ చరణ్ కాంబినేషన్‌లో మరో మల్టీ స్టారర్ మూవీనా.. ముహూర్తం కూడా ఫిక్స్ !

జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి ఇద్దరు స్టార్ హీరోలు కలిసి ఒక సినిమా చేస్తారని ఎవరు ఊహించి ఉండరు. కాని దానిని సుసాధ్యం చేశాడు రాజమౌళి. ఆర్ఆర్ఆర్ పేరుతో ఓ అద్భుతాన్ని తెరకెక్కించి ఆ మూవీతో ఆస్కార్ కూడా దక్కేలా చేశాడు.ఈ సినిమా తెలుగు సినిమా ఖ్యాతిని హాలీవుడ్ వరకు తీసుకెళ్లింది. ఇందులో రామ్ చరణ్, ఎన్టీఆర్‌లు పోటా పోటీగా నటించారు. రామ్ పాత్రలో రామ్ చరణ్, భీమ్ పాత్రలో ఎన్టీఆర్ అదరగొట్టేశారు. ఇక ఈ సినిమా హాలీవుడ్ రేంజ్ లో గ్రామీ అవార్డ్ తో పాటు పలు అవార్డులు సాధించింది. కలెక్షన్స్ విషయానికి వస్తే ఏకంగా రూ.1200 కోట్లు రాబట్టింది. అయితే ఇప్పుడు ఈ ఇద్దరి కాంబినేషన్‌లో మరో మల్టీస్టారర్ రాబోతుందనే చర్చ జోరుగా నడుస్తుంది.రామ్ చరణ్, ఎన్టీఆర్ కాంబోలో సినిమా అంటే అది ఆర్ఆర్ఆర్ సినిమాకి సీక్వెలా? లేకుంటే వేరే దర్శకుడు వీరిద్దరితో కలిసి పని చేయబోతున్నాడా? ఎప్పుడు సినిమా స్టార్ట్ అవుతుంది వంటి ఆలోచనలు ఎన్నో ఉన్నాయి. అయితే ఇక్కడ విషయం ఏంటంటే వీరిద్దరు కలిసి మరోసారి త్రిపుల్ ఆర్ సినిమానే చేయబోతున్నారట. గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా ఇంకా అయిపోలేదని, మూవీకి సీక్వెల్ ఉందని సినిమా రచయిత, రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ గతంలోనే ఓ సందర్భంలో చెప్పారు.

'నో' చెబితే టచ్ చేసే సాహసం చేయరు

హీరోయిన్లకు ఎక్స్‌పోజింగ్ అవసరమా? అంటే, అవసరమే అంటోంది చాందిని తమిళరసన్. జెనీలియా పోలికలతో ఉన్న ఈ బ్యూటీ ప్రస్తుతం కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. చెన్నైలో పుట్టి పెరిగిన ఈ యువ నటి.. ప్రస్తుతం సినిమా ఇండస్ట్రీలో ఉన్న పరిస్థితులపై సూటిగా చెప్పుకొచ్చింది. ఆమె ఏమందంటే..

"సినిమా పరిశ్రమ సురక్షితమైంది. ఇక్కడ మనల్నికాదని ఏదీ జరగదు. 'నో' చెబితే ఎవరూ టచ్ చేసేందుకు సాహసించరు. నో మీన్స్ నో.. వద్దు అంటే ఇక్కడ వద్దనే" అని చిత్ర పరిశ్రమలోని క్యాస్టింగ్ కౌచ్‌పై యువ హీరోయిన్ చాందిని తమిళరసన్ కుండబద్ధలు కొట్టారు. 'సిద్ధు ప్లస్-2'తో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ భామ.. 'నాన్ రాజావాగ పోగిరేన్', 'విల్ అంబు', 'కట్టాప్పావై కాణోమ్', 'మన్నర్ వాగైయ్యా', 'కసడ తపర' వంటి అనేక చిత్రాల్లో నటించారు. తెలుగులో 'బుజ్జి ఇలా రా', 'రామ్ అసుర్' వంటి చిత్రాలలో నటించి.. తెలుగు ప్రేక్షకులకూ ఈ భామ పరిచయమైంది. చెన్నైలో పుట్టి పెరిగిన ఈ యువ నటి.. ప్రస్తుతం తమిళంతో పాటు టాలీవుడ్‌లోనూ బిజీగా ఉన్నారు. తాజాగా ఆమె ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మనసువిప్పి మాట్లాడారు.

సైలెంట్‌గా ఉన్నట్లు కనిపించినా.. ఇప్పుడు మాత్రం

అదృష్టం తలుపుతట్టడం ఆలస్యమైతే అయిందిగానీ... ఆ అమ్మడి స్పీడ్ ఇప్పుడు మాములుగా లేదు. చేసింది తక్కువ సినిమాలే అయినా చూస్తుండగానే స్టార్ బ్యూటీలను వెనక్కి నెట్టేస్తోంది. ఆ స్పీడ్ చూస్తోంటే... త్వరలోనే టాప్ చైర్ ఎక్కేలా కనిపిస్తోంది. ఆ బ్యూటీ ఎవరో భాగ్యశ్రీ బోర్సే. కొన్నాళ్ళుగా ఇండస్ట్రీలో టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అవుతోంది భాగ్యశ్రీ బోర్సే. నిన్న మొన్నటి వరకు కాస్త సైలెంట్‌గా ఉన్నట్లు కనిపించినా..ఇప్పుడు మాత్రం ఇండస్ట్రీ అంతా తనదే అనేస్తోంది.'మిస్టర్ బచ్చన్')తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది బ్యూటీ. ఫస్ట్ సినిమాతోనే నటన పరంగా, గ్లామర్ పరంగా మంచి మార్కులే కొట్టేసింది. సినిమా ఫ్లాప్ గా నిలిచినప్పటికి ఈ భామ క్రేజ్ మాత్రం తగ్గలేదు. ఓ సినిమా అలా సెట్స్ పైకి వెళ్లగానే.. మరో క్రేజీ ప్రాజెక్టు సైన్ చేస్తోంది. ఇంకా చెప్పాలంటే రాబోయే సినిమాలన్నీ ఈ భామవే. అంతే కాదు స్టార్ హీరోలకు సైతం ఫేవరేట్ అయిపోతుంది. ప్రజెంట్ దుల్కర్ సల్మాన్ తో 'కాంత' మూవీ చేస్తోంది. విజయ్ దేవరకొండతో 'కింగ్ డమ్'చేస్తోంది. దీనితో పాటు రామ్ పోతినేనితో రొమాన్స్ చేయనుంది. అయితే ఈ మూడు సినిమాలు ఈ ఏడాదిలోనే రిలీజ్ కానున్నట్లు తెలుస్తోంది. 'కింగ్ డమ్' మేలో రిలీజ్ అవుతోంది.

వెంటాడే సొంతూరి జ్ఞాపకాలు

ఇంటి చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు.. బంధాల నేపథ్యంలో రూపొందిన వెబ్ సిరీస్ 'హోంటౌన్'. రాజీవ్ కనకాల, ఝాన్సీ, ప్రజ్వల్ యాద్మ, సాయిరామ్, అనీ, అనిరుధ్, జ్యోతి ప్రధాన పాత్రధారులు. శ్రీకాంత్‌రెడ్డి పల్లే దర్శకుడు. నవీన్ మేడారం, శేఖర్ మేడారం నిర్మాతలు. ఏప్రిల్ 4న ఓటీటీ ప్లాట్‌ఫాం ఆహాలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సిరీస్ ట్రైలర్‌ని అగ్రహీరోగా విజయ్ దేవరకొండ మంగళవారం విడుదల చేసి, చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'బ్రతుకుతెరువు కోసం సొంతూర్లను విడిచిపెట్టినా.. ఊరి జ్ఞాపకాలు మాత్రం మనల్ని విడిపెట్టవ్. ఆ జ్ఞాపకాలను గుర్తు చేసేలా ఈ సిరీస్ ఉంటుంది' అని మేకర్స్ చెబుతున్నారు. కుటుంబ సంఘర్షణల నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా ఈ ట్రైలర్ సాగింది. రాజీవ్‌కనకాల, ఝాన్సీ, అనీ.. తదితరులు ట్రైలర్‌లో ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి కెమెరా: దేవ్‌దీప్ గాంధీ కుండు, సంగీతం: సురేష్ బొబ్బిలి.